ADVERTISING
నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM
# నేటి దర్శిని
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ,
మండల స్థాయిలో రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తి, అనుభవం
ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్
చేసి సంప్రదించగలరు.
Contact Number
9059328777

రంగారెడ్డి బుధవారం 30-09-2026 సంపుటి: 02 సంచిక : 150 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని
Ranga Reddy Wednesday, 30-09-2026 Volume :02 Issue: 150 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani

## నేడు సిరిసిల్లలో సీఎం భారీ
# బహిరంగ సభ



### సీఎంగా తొలిసారి సిరిసిల్లకు రేవంత్ రెడ్డి..

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు
- రూ.345.78 కోట్ల పనులకు సిఎం శ్రీకారం
- బహిరంగ సభపై సర్వత్రా నెలకొన్న ఆసక్తి

హైదారాబాద్,
తెలంగాణ రాజకీయాల్లో సిరిసిల్ల ఇప్పుడు మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నేడు సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సీఎం హోదాలో ఆయన తొలిసారి సిరిసిల్లకు రావడం ఒకవైపు అయితే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుండటం మరోవైపు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనలో రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో విద్య, ఆలయ అభివృద్ధి, పరిపాలనా మౌలిక వసతులు, మహిళా సాధికారత, నేతన్నల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలు ఉన్నాయి. సిరిసిల్లకు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైనట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది.సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా సుమారు రూ.345.78 కోట్ల

-మిగతా 2 లో


02

## సిరీస్‌పై గిల్
# సేన నజర్

- నేడు వెస్టిండీస్‌తో రెండో వన్డే
- సిరీస్ కైవసం చేసుకోవడమే లక్ష్యం
- మధ్యాహ్నం 2 గంటల నుంచి మ్యాచ్
- తొలి వన్డేలో టీమిండియా ఘన విజయం
- కోహ్లీ, గిల్ శతకాలతో చెలరేగిన భారత్
- 296 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించిన జట్టు
- కుల్దీప్ యాదవ్ నాలుగు వికెట్లతో అదుర్స్
- సిరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశం
- బ్యాటింగ్ విభాగంలో మార్పులు లేనట్టే
- రెండో మ్యాచ్‌లోనూ అదే జోరు కొనసాగించాలని గిల్ సేన
- వెస్టిండీస్‌కు సిరీస్ సమం చేసేందుకు కీలక పోరు



## పేదల కన్నీటికి
# విలువ కట్టలేం..

- ఏడాదిలోపే ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందిస్తాం
- ఎదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం
- డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

హైదారాబాద్,
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంత ఇంటిని చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. క్యూఆర్/కోర్ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల

-మిగతా 2 లో

# ఉగ్రవాదంపై భారత్ రెడ్‌లైన్

- అమెరికాకు జైశంకర్ పరోక్ష హెచ్చరిక
- ఉగ్రవాదంపై భారత్ వైఖరిలో రాజీ ఉండదన్న జైశంకర్
- భద్రతా ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించాలి
- భారత్ సమస్యను అర్థం చేసుకోకపోతే ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం
- పాకిస్థాన్ నుంచి సరిహద్దు ఉగ్రవాదంపై ఆందోళన
- దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్న భారత్
- భారత్-అమెరికా బంధంలో ఉగ్రవాదం కీలక అంశమన్న విదేశాంగ మంత్రి
- వాణిజ్య వివాదాలతోపాటు ఉగ్రవాదంపైనా భేదాభిప్రాయాలు
- ఉగ్రవాదంపై భారత్ పలుమార్లు ఆధారాలు సమర్పించిందన్న జైశంకర్
- భారత్-అమెరికా సంబంధాలు ముందుకు సాగాలని ఆకాంక్ష
- న్యూయార్క్‌లో ఏషియా సొసైటీ కార్యక్రమంలో వ్యాఖ్యలు


02

## 6 నెలలు రేషన్
# తీసుకోకుంటే కార్డు హోల్డ్!

- అక్టోబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా కొత్త విధానం
- 1.58 కోట్ల రేషన్ కార్డులు తాత్కాలికంగా నిలిపివేత
- ఆరు నెలలుగా సరుకులు తీసుకోని కార్డులపై చర్యలు
- లబ్ధిదారులకు మూడు నెలల గడువు
- నిరూపించుకుంటే మళ్లీ కార్డు యాక్టివేషన్
- బోగస్, డూప్లికేట్ కార్డుల ఏరివేతకు చర్యలు
- ఆధార్, ఈ-కేవైసీతో పీడీఎస్ డేటాబేస్ ప్రక్షాళన
- ఇప్పటికే 5.8 కోట్ల బోగస్ కార్డుల తొలగింపు
- చనిపోయిన వారి పేర్లను కూడా తొలగించే ప్రక్రియ
- రాష్ట్రాల వారీగా లబ్ధిదారుల వివరాల సేకరణ


02



## ఫార్మా భూములు
# రైతులకే ఇవ్వాలి

- ఎన్నికల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్న కేటీఆర్
- రైతులకు భూములు తిరిగి ఇవ్వకుండా ఫ్యూచర్ సిటీ పేరుతో విక్రయిస్తున్నారని ఆరోపణ
- ఎకరాకు రూ.4 కోట్ల చొప్పున అమ్మేందుకు సిద్ధమయ్యారని విమర్శ
- భూముల కోసం రైతులు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణ
- ఫార్మాసిటీ భూములపై ప్రభుత్వం మాట తప్పిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ధ్వజం
- రైతుల భూములను వారికి తిరిగి ఇవ్వాలని డిమాండ్
- రాహుల్‌గాంధీని ఉద్దేశించి కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్,
: హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను బాధిత రైతులకు తిరిగి ఇవ్వకుండా ఫ్యూచర్ సిటీ పేరుతో విక్రయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను బాధిత రైతులకు తిరిగి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. తమ భూములను తిరిగి ఇవ్వాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారని,

-మిగతా 2 లో

## తుమ్మిడిహట్టి అనుమతులకు
# చొరవ చూపండి

### కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి

- మహారాష్ట్రతో త్వరగా ఒప్పందం కుదిరేలా చూడాలి
- ఎఫ్ఆర్ఎల్ 0152 మీటర్ల వద్ద బ్యారేజీ నిర్మాణానికి ప్రతిపాదన
- గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీటి తరలింపునకు అవకాశం
- పీఆర్ఎల్ఐఎస్, డిండి, సీతారామ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు కోరిన సీఎం
- సమ్మక్కసాగర్ ప్రాజెక్టు పెండింగ్ అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి
- కృష్ణా జలాల పర్యవేక్షణకు టెలీమెట్రీ ఏర్పాట్లు వేగవంతం చేయాలి
- తొలి దశ టెలీమెట్రీ కోసం రూ.4.15 కోట్లు ఇప్పటికే జమ చేసిన తెలంగాణ ప్రభుత్వం

02

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రతో త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకుని అనుమతులు ఇప్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సమావేశమైన సీఎం.. కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై చర్చించారు. ఎఫ్ఆర్ఎల్ 0152 మీటర్ల స్థాయిలో తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీటిని తరలించే అవకాశం ఉంటుందని, తద్వారా విద్యుత్ వినియోగం, వ్యయం తగ్గుతాయని వివరించారు. పాలమూరు--రంగారెడ్డి, డిండి, సీతారామసాగర్, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు, సమ్మక్కసాగర్‌కు పెండింగ్ అనుమతులు త్వరగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కృష్ణా జలాల పర్యవేక్షణకు కేఆర్ఎంబీ ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ ఏర్పాట్లను వేగవంతం చేయాలని కోరారు. తొలి దశ టెలీమెట్రీ కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ.4.15 కోట్లు జమ చేసిందని తెలిపారు.




02

## పాక్ ఎయిర్‌స్పేస్‌కు
# భారత్ గుడ్‌బై..

- చైనా నుంచి కొత్త మార్గంలో విమాన ప్రయాణం
- చైనా జిన్‌జియాంగ్ ఎయిర్‌స్పేస్‌పై భారత్ దృష్టి
- ఏడాదిగా కొనసాగుతున్న భారత్-చైనా సంప్రదింపులు
- పాక్ ఆంక్షలతో పెరిగిన విమానాల ప్రయాణ దూరం
- విమానయాన సంస్థలపై పెరుగుతున్న అదనపు భారం
- ప్రత్యామ్నాయ ఎయిర్‌స్పేస్ రూట్ల కోసం భారత్ అన్వేషణ
- రష్యా విమానానికి గగనతల అనుమతి నిరాకరణ
- రూప్‌పూర్ అణు కేంద్రానికి యురేనియం సరఫరా
- సాంకేతిక కారణాలతోనే అనుమతి ఇవ్వలేదన్న పాక్

## బ్యాంకాక్‌లో
# వరద బీభత్సం..


02

# 9 శాతం మంది విద్యార్థుల్లో ఆత్మహత్య ఆలోచనలు

- ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల మానసిక స్థితిపై ఎన్‌టీఎఫ్ సర్వే
- 2.43 లక్షల మంది విద్యార్థుల అభిప్రాయాల సేకరణ
- 9 శాతం మందికి తరచూ ఆత్మహత్య ఆలోచనలు వస్తున్నట్లు వెల్లడి
- 15 శాతం మంది విద్యార్థులు తీవ్ర బాధను ఎదుర్కొన్నట్లు గుర్తింపు
- 34 శాతం మంది క్యాంపస్‌లో తాము బయటి వ్యక్తులమనే భావనలో
- 32 శాతం విద్యాసంస్థల్లో కౌన్సెలింగ్ సేవలు లేవని నివేదిక
- కుల వివక్ష, లైంగిక వేధింపులు సహా పలు అంశాలపై ఆందోళనలు
- అక్టోబర్ 31న ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్న ఎన్‌టీఎఫ్

02

దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిస్థితులపై సుప్రీంకోర్టు నియమించిన నేషనల్ టాస్క్ ఫోర్స్ నిర్వహించిన సర్వేలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 2.43 లక్షల మంది విద్యార్థులను ప్రశ్నించగా.. దాదాపు 9 శాతం మంది గత ఏడాది నుంచి తరచూ ఆత్మహత్య ఆలోచనలు వచ్చినట్లు వెల్లడించారు. మరో 15 శాతం మంది గత ఆరు నెలల్లో తీవ్ర విచారం, ఆందోళన వంటి భావోద్వేగాలను ఎదుర్కొన్నట్లు తెలిపారు. క్యాంపస్‌లో తాము బయటి వ్యక్తులుగా భావిస్తున్నామని 34 శాతం మంది పేర్కొనగా.. 32 శాతం విద్యాసంస్థల్లో కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో లేవని సర్వే వెల్లడించింది. కుల వివక్ష, సామాజిక అసమానతలు, లైంగిక వేధింపులు వంటి అంశాలు కూడా విద్యార్థుల మానసిక పరిస్థితిపై ప్రభావం చూపుతున్నట్లు నివేదికలో ప్రస్తావించారు. అక్టోబర్ 31న ఎన్టీఎఫ్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనుంది.



WWW.NETIDARSHINI.COM RNI NO: TGTEL/25/A0471 తెలుగు దిన పత్రిక సత్య శోధనే మా లక్ష్యం

# ఉగ్రవాదంపై భారత్ రెడ్‌లైన్

- అమెరికాకు జైశంకర్ పరోక్ష హెచ్చరిక
- ఉగ్రవాదంపై భారత్ వైఖరిలో రాజీ ఉండదన్న జైశంకర్
- భద్రతా ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించాలి
- భారత్ సమస్యను అర్థం చేసుకోకపోతే ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం
- పాకిస్థాన్ నుంచి సరిహద్దు ఉగ్రవాదంపై ఆందోళన
- దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్న భారత్
- భారత్-అమెరికా బంధంలో ఉగ్రవాదం కీలక అంశమన్న విదేశాంగ మంత్రి
- వాణిజ్య వివాదాలతోపాటు ఉగ్రవాదంపైనా భేదాభిప్రాయాలు
- ఉగ్రవాదంపై భారత్ పలుమార్లు ఆధారాలు సమర్పించిందన్న జైశంకర్
- భారత్-అమెరికా సంబంధాలు ముందుకు సాగాలని ఆకాంక్ష
- న్యూయార్క్‌లో ఏషియా సొసైటీ కార్యక్రమంలో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ



భారత్-అమెరికా సంబంధాలపై కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం పై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని స్పష్టంచేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్ గీసుకుందని, ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని వ్యాఖ్యానించారు. భారత్‌లో ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్ పట్ల అమెరికా సానుకూల ధోరణి కనబరుస్తున్న నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నతస్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోందంటూ పాకిస్థాన్ పేరును ప్రస్తావించకుండానే జైశంకర్ దుయ్యబట్టారు. అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుందని అన్నారు. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. భారత్-అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతోపాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ చెప్పారు. భారత్-అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పొరుగు దేశం నుంచే మద్దతు అందుతోందని నిరూపించేందుకు భారత్ పదేపదే తగిన ఆధారాలను సమర్పించిందని ఆయన గుర్తుచేశారు.

# 6 నెలలు రేషన్ తీసుకోకుంటే కార్డు హోల్డ్!



- అక్టోబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా కొత్త విధానం
- 1.58 కోట్ల రేషన్ కార్డులు తాత్కాలికంగా నిలిపివేత
- ఆరు నెలలుగా సరుకులు తీసుకోని కార్డులపై చర్యలు
- లబ్ధిదారులకు మూడు నెలల గడువు
- నిరూపించుకుంటే మళ్లీ కార్డు యాక్టివేషన్
- బోగస్, డూప్లికేట్ కార్డుల ఏరివేతకు చర్యలు
- ఆధార్, ఈ-కేవైసీతో పీడీఎస్ డేటాబేస్ ప్రక్షాళన
- ఇప్పటికే 5.8 కోట్ల బోగస్ కార్డుల తొలగింపు
- చనిపోయిన వారి పేర్లను కూడా తొలగించే ప్రక్రియ
- రాష్ట్రాల వారీగా లబ్ధిదారుల వివరాల సేకరణ

న్యూఢిల్లీ

రేషన్ కార్డుల ప్రక్షాళనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బోగస్, డూప్లికేట్, అనర్హులైన లబ్ధిదారులను తొలగించే ప్రక్రియను మరింత వేగవంతం చేయనుంది. ఇందులో భాగంగా ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోని కార్డులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అక్టోబర్ 1 నుంచి ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తున్నట్లు ఓ ప్రముఖ జాతీయ మీడియా కథనం పేర్కొంది. ఈ క్రమంలో సుమారు 1.58 కోట్ల రేషన్ కార్డులను తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నకిలీ, డూప్లికేట్ కార్డులతో పాటు మరణించిన వ్యక్తుల పేర్లతో కొనసాగుతున్న కార్డులు, అనర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. ఆధార్ అనుసంధానం, డిజిటలైజేషన్, ఈ-కేవైసీ వంటి విధానాల ద్వారా పీడీఎస్ డేటాబేస్‌ను ప్రక్షాళన చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా నవంబర్ 2024 నాటికి డీడూప్లికేషన్, బయోమెట్రిక్ సీడింగ్, ఈ-కేవైసీ ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 5.8 కోట్ల బోగస్ రేషన్ కార్డులను తొలగించినట్లు కేంద్ర ఆహార శాఖ వెల్లడించింది. అయితే ఆరు నెలలుగా రేషన్ తీసుకోని కార్డులను వెంటనే పూర్తిగా రద్దు చేయబోరని తెలుస్తోంది. ముందుగా వాటిని తాత్కాలికంగా డీయాక్టివేట్ చేయనున్నారు. ఇలా కార్డు నిలిపివేసిన లబ్ధిదారులకు తాము నిజమైన అర్హులమేనని నిరూపించుకునేందుకు మూడు నెలల సమయం ఇవ్వనున్నట్లు కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి తెలిపినట్లు సమాచారం. ఈ వ్యవధిలో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి అర్హతను నిర్ధారించుకుంటే కార్డును మళ్లీ యాక్టివేట్ చేయనున్నారు. ప్రస్తుతం ఈ ప్రక్రియకు సంబంధించి రాష్ట్రాల వారీగా వివరాలను కేంద్రం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

# పాక్ ఎయిర్‌స్పేస్‌కు భారత్ గుడ్‌బై..

న్యూఢిల్లీ



సుదూర ప్రాంతాలకు భారత్ నుంచి వెళ్లే విమానాలు గతంలో పాకిస్తాన్ గగనతలాన్ని ఉపయోగించుకునేవి. పాక్ గగనతలం మీదుగా కొన్ని గమ్యస్థానాలకు భారత విమానాలు రాకపోకలు సాగించేవి. అయితే ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య నెలకొన్న విభేదాల నేపథ్యంలో పాకిస్తాన్ తరచూ తన ఎయిర్‌స్పేస్‌ను మూసివేస్తోంది. దీంతో భారత్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ విమానయాన మార్గాలను భారత్ అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా చైనాలోని జిన్‌జియాంగ్ ప్రాంతంలోని ఎయిర్‌స్పేస్ మార్గాన్ని పరిశీలిస్తోంది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తోంది. ఈ అంశంపై చైనాతో భారత్ కొంతకాలంగా చర్చలు జరుపుతోంది. కేంద్ర విమానయాన శాఖ సూచన మేరకు భారత విదేశీ వ్యవహారాల శాఖ చైనాతో ఏడాది కాలంగా సంప్రదింపులు కొనసాగిస్తోంది. భారత్-పాక్ మధ్య విభేదాల నేపథ్యంలో భారత విమానాలకు పాకిస్తాన్ ఎయిర్‌స్పేస్ మూసివేసింది. దీంతో భారత్ నుంచి వెళ్లే లేదా భారత్‌కు వచ్చే విమానాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల విమానాల ప్రయాణ దూరం పెరుగుతోంది. ప్రయాణ సమయం కూడా ఎక్కువవుతోంది. విమానయాన సంస్థలకు ఇంధన వినియోగం, నిర్వహణ తదితర ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పాక్ గగనతలంపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ ఎయిర్‌స్పేస్ రూట్లను అందుబాటులోకి తీసుకురావడానికి భారత్ ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు పాకిస్తాన్ ఎయిర్‌స్పేస్‌కు సంబంధించి తాజాగా మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యాకు చెందిన అణు ఇంధనంతో కూడిన విమానం బంగ్లాదేశ్ వెళ్లేందుకు పాకిస్తాన్ గగనతలాన్ని ఉపయోగించుకోవాలని భావించింది. అయితే ఇందుకు పాకిస్తాన్ అనుమతి నిరాకరించినట్లు సమాచారం. బంగ్లాదేశ్‌లోని రూప్పూర్ అణు విద్యుత్ కేంద్రానికి అవసరమైన అణు ఇంధనం, సాంకేతిక సహకారం అందించేందుకు రష్యా విమానం వెళ్లాల్సి ఉంది.రష్యాకు చెందిన ఈ కార్గో విమానంలో యురేనియం ఉన్నట్లు సమాచారం. విమానం తమ గగనతలం మీదుగా వెళ్లేందుకు పాక్ అనుమతి ఇవ్వలేదు. అయితే కొన్ని సాంకేతిక, అనుమతి, నిర్వహణపరమైన కారణాల వల్లే రష్యా విమానానికి అనుమతి నిరాకరించాల్సి వచ్చిందని పాకిస్తాన్ ఆ తర్వాత ప్రకటించింది.

# బ్యాంకాక్‌లో వరద బీభత్సం..

బ్యాంకాక్



భారీ వర్షాలతో బ్యాంకాక్‌లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో వరద నీటిలోనే స్థానికులు తమ రోజువారీ అవసరాలను తీర్చుకునేందుకు వినూత్నంగా తేలియాడే మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. షాపింగ్ మాల్ సమీపంలో నీట మునిగిన వీధిలో చిన్న పడవలు, తేలియాడే వేదికలు, ఫోమ్ బాక్స్‌లపై చేపలు, కూరగాయలు మొదలైనవాటిని విక్రయిస్తున్నారు. వరదనీటిలో కొందరు నడుచుకుంటూ మార్కెట్‌కు చేరుకుంటుండగా, మరికొందరు చిన్న పడవలు, తెప్పల సాయంతో తాత్కాలిక దుకాణాల వద్దకు వెళ్లి, వస్తువులు కొనుగోలు చేస్తున్నారు.

# 9 శాతం మంది విద్యార్థుల్లో ఆత్మహత్య ఆలోచనలు

- ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల మానసిక స్థితిపై ఎన్‌టీఎఫ్ సర్వే
- 2.43 లక్షల మంది విద్యార్థుల అభిప్రాయాల సేకరణ
- 9 శాతం మందికి తరచూ ఆత్మహత్య ఆలోచనలు వస్తున్నట్లు వెల్లడి
- 15 శాతం మంది విద్యార్థులు తీవ్ర బాధను ఎదుర్కొన్నట్లు గుర్తింపు
- 34 శాతం మంది క్యాంపస్‌లో తాము బయటి వ్యక్తులమనే భావనలో
- 32 శాతం విద్యాసంస్థల్లో కౌన్సెలింగ్ సేవలు లేవని నివేదిక
- కుల వివక్ష, లైంగిక వేధింపులు సహా పలు అంశాలపై ఆందోళనలు
- అక్టోబర్ 31న ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్న ఎన్‌టీఎఫ్



న్యూఢిల్లీ: దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లోని విద్యార్థులు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. అయితే దీనికి గల కారణాలను అన్వేషించేందుకు సుప్రీంకోర్టు నియమిత ప్యానల్ విద్యార్థులపై సర్వే చేపట్టింది. సూసైడ్ ఆలోచనల(ాబఊఎఊఝశ్రీ ఒ్తశీబస్త్రష్ట్ర)తో సతమతం అవుతున్న విద్యార్థుల సంఖ్య 9 శాతంగా ఉన్నట్లు దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వే ఆధారంగా వెల్లడైనట్లు సుప్రీం నియమిత ప్యానెల్ తెలిపింది. ఇక ఉన్నత విద్యా సంస్థల్లో సుమారు 15 శాతం మంది విద్యార్థులు గత ఆరు నెలల్లో కొన్ని సందర్భాల్లో అత్యంత సంతోషాన్ని, కొన్ని సందర్భాల్లో బాధను ఎదుర్కొన్నట్లు సర్వేలో తేల్చారు. సర్వేకు చెందిన వివరాలను ఓ మీడియా సంస్థ సేకరించింది. విద్యార్థుల్లో ఉన్న మానసిక ఆందోళనలను తగ్గించేందుకు, వారిలో ఆత్మహత్య ఆలోచనల్ని తగ్గించేందుకు సర్వే ద్వారా వివరాలను సేకరించారు. నేషనల్ టాస్క్ ఫోర్స్ దీనిపై నివేదికను తయారు చేసింది. అక్టోబర్ 31వ తేదీన ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.ఇటీవల ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే విద్యా సంస్థల్లో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. గతంలోనూ సుప్రీం నియమిత ప్యానెల్ ఓ తాత్కాలిక రిపోర్టును సమర్పించింది. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారిలో సామాజిక అసమానతలు ఉన్నాయని, ఇక మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీల్లో లైంగిక వేధింపులు ఎక్కువగా ఉన్నట్లు ఆ రిపోర్టులో తెలిపారు. మెడికల్, లా, స్టేట్ యూనివర్సిటీల్లోని బోధనా సిబ్బందిలో లింగ వ్యత్యాసం ఉందన్నారు. నీట్ యూజీ, జేఈఈ ర్యాంకుల్లో కులం ఆధారంగా గుర్తింపు, కుల వివక్ష, కులం పేరుతో అవమానాలు, అడ్మిషన్ సమయంలో కుల ప్రస్తావన లాంటి అంశాల వల్ల విద్యార్థుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఆ రిపోర్టులో తెలిపారు. ఎన్‌టీఎఫ్ రిపోర్టు ప్రకారం సుమారు 2.43 లక్షల మంది విద్యార్థులను సర్వేలో భాగంగా ప్రశ్నించారు. దీంట్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీకి చెందిన 67 శాతం మంది ఉన్నారు. అయితే వీరిలో 34 శాతం మంది క్యాంపస్‌లో బయటి వ్యక్తులు ఫీలవుతున్నట్లు చెప్పారు. సుమారు 15 శాతం మంది విద్యార్థులు గత ఆరు నెలలుగా బాధకు గురైనట్లు పేర్కొన్నారు. కొన్ని వారాల పాటు ఆందోళనతో ఉన్నట్లు విద్యార్థులు చెప్పారు. ఆత్మహత్య చేసుకోవాలన్న భావనలను గత ఏడాది నుంచి తరుచూ వస్తున్నట్లు సుమారు 9 శాతం మంది పేర్కొన్నారు. ఇక విద్యాసంస్థల్లో ఎదురయ్యే పరిస్థితిని చక్కదిద్దేందుకు 56 శాతం యాజమాన్యాలు సమర్థంగా ఉన్నట్లు రిపోర్టులో తెలిపారు. 32 శాతం విద్యా సంస్థల్లో కౌన్సిలింగ్ సేవలు లేనట్లు తెలిసింది. గత కొన్ని నెలలుగా ఎన్టీఎఫ్ సుమారు 19 విద్యా సంస్థలతో 30 మీటింగ్‌లు నిర్వహించింది. ఢిల్లీ, ఎన్సీఆర్, తమిళనాడు, కర్నాటక, అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో ఎన్టీఎఫ్ విద్యాసంస్థలతో మాట్లాడింది. గత ఏడాది మార్చిలో ఎన్టీఎఫ్‌ను సుప్రీం నియమించింది. ఆ ప్యానల్‌కు జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ అధిపతిగా ఉన్నారు. ఆయనతో పాటు కొంత మంది నిపుణులు ఆ బృందంలో ఉన్నారు. ప్రఖ్యాత సైక్రియాట్రిస్ట్ అలోక్ సారిన్, మేరీ ఈ జాన్, అర్మాన్ అలీ, రాజేంద్ర కచ్రూ, సీమా మెహరోత్రా, నిమ్‌హన్స్ ఆ బృందంలో ఉన్నారు.

# నేడు సిరిసిల్లలో సీఎం భారీ బహిరంగ సభ

మొదటి తరువాయి

విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వేములవాడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం రేవంత్ శంకుస్థాపన చేయనున్నారు. పెద్దూరులో సుమారు 18 ఎకరాల్లో నిర్మించనున్న ఈ విద్యా సముదాయంలో 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు వసతి, తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్, క్రీడా సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఆధునిక తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్ హాళ్లు, క్రీడా సదుపాయాలు, ఐటీ మౌలిక వసతులు కల్పించనున్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కూడా సీఎం రేవంత్ పర్యటనలో కీలకంగా ఉండనున్నాయి. ఆలయ విస్తరణ, మండపాలు, గోపురాలు, ప్రాకారాలు, సైట్ డెవలప్‌మెంట్, నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, విద్యుత్ పనులు, షాపింగ్ కాంప్లెక్స్, రోడ్ల నిర్మాణం వంటి పనులకు సంబంధించిన 26 పనులకు రూ.99.40 కోట్ల అదనపు నిధులను ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. దీంతో ఆలయ అభివృద్ధికి ఇప్పటివరకు మంజూరైన మొత్తం నిధులు రూ.249.40 కోట్లకు చేరాయి. జిల్లాలో పరిపాలనా మౌలిక వసతుల విస్తరణలో భాగంగా కొత్త ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికీ సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడలో ఆర్డీవో కార్యాలయాలు, పలు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణాలు ఇందులో ఉన్నాయి. రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టనున్నారు. ఇక.. సిరిసిల్ల అంటేనే చేనేత, పవర్‌లూమ్ పరిశ్రమ. అందుకే సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో నేతన్నల అంశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. చేనేత, పవర్‌లూమ్ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే ఉద్దేశంతో 'నేతన్న బజార్' ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ముఖ్యంగా సిరిసిల్లలో పవర్‌లూమ్‌లపై ఉత్పత్తి అయ్యే పెట్టీకోట్, పాలియెస్టర్ వస్త్రాలకు మార్కెట్ కల్పించడమే దీని ఉద్దేశంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెబుతోంది. అయితే ఈ ప్రాజెక్టుకు తుది మంజూరు, వ్యయం ఇంకా ఖరారు కాలేదని అందుబాటులో ఉన్న వివరాలు సూచిస్తున్నాయి. ఇదే సమయంలో నేతన్నలకు బకాయిలు, వస్త్ర ఆర్డర్లు, బతుకమ్మ చీరల పథకం వంటి అంశాలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిరిసిల్ల నేతన్నలకు గత ప్రభుత్వ హయాంలో రూ.300 కోట్ల బకాయిలు మిగిలాయని ఆరోపించారు.

# సిరీస్‌పై గిల్ సేన నజర్

- నేడు వెస్టిండీస్‌తో రెండో వన్డే
- సిరీస్ కైవసం చేసుకోవడమే లక్ష్యం
- మధ్యాహ్నం 2 గంటల నుంచి మ్యాచ్
- తొలి వన్డేలో టీమిండియా ఘన విజయం
- కోహ్లీ, గిల్ శతకాలతో చెలరేగిన భారత్
- 296 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించిన జట్టు
- కుల్దీప్ యాదవ్ నాలుగు వికెట్లతో అదుర్స్
- సిరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశం
- బ్యాటింగ్ విభాగంలో మార్పులు లేనట్టే
- రెండో మ్యాచ్‌లోనూ అదే జోరు కొనసాగించాలని గిల్ సేన
- వెస్టిండీస్‌కు సిరీస్ సమం చేసేందుకు కీలక పోరు



గువాహటి

వెస్టిండీస్‌తో సొంతగడ్డపై జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో అదిరే బోణీ కొట్టిన భారత జట్టు ఇప్పుడు మరో పోరుకు సిద్ధమైంది. నేడు గువాహటి వేదికగా భారత్, వెస్టిండీస్ మధ్య రెండో వన్డే జరగనుంది. ఇప్పటికే తొలి మ్యాచ్‌లో సూపర్ విక్టరీ సాధించిన శుభ్‌మన్ గిల్ సారథ్యంలో ని టీమిండియా.. రెండో వన్డేలోనూ గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉంది.
తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లీ (139 నాటౌట్), కెప్టెన్ గిల్ (110) అద్భుత శతకాలతో రాణించడంతో భారత్.. 296 పరుగుల లక్ష్యాన్ని 41.4 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. అంతకుముందు బౌలింగ్‌లో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా 4 వికెట్లతో సత్తా చాటాడు. ఇక రెండో వన్డేలోనూ అదే జోరు కొనసాగించాలని భారత ప్లేయర్లు భావిస్తున్నారు.
అయితే, ఈ మ్యాచ్‌లో టీమిండియా పలు మార్పులతో బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత మ్యాచ్‌లో పెద్దగా ప్రభావం చూపని డెబ్యూ బౌలర్ నమన్ ధీర్‌ను పక్కన పెట్టి అతడి స్థానంలో హైదరాబాదీ స్టార్ మహమ్మద్ సిరాజ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని భారత మేనేజ్‌మెంట్ భావిస్తోందని సమాచారం. బ్యాటింగ్ విభాగంలో ఎలాంటి మార్పులు లేకుండా తొలి వన్డే జట్టుతోనే బరిలోకి దిగే ఛాన్స్ ఉంది.

# తుమ్మిడిహట్టి అనుమతులకు చొరవ చూపండి

- మహారాష్ట్రతో త్వరగా ఒప్పందం కుదిరేలా చూడాలి
- ఎఫ్ఆర్ఎల్ ౦152 మీటర్ల వద్ద బ్యారేజీ నిర్మాణానికి ప్రతిపాదన
- గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీటి తరలింపునకు అవకాశం
- పీఆర్ఎల్ఐఎస్, డిండి, సీతారామ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు కోరిన సీఎం
- సమ్మక్కసాగర్ ప్రాజెక్టు పెండింగ్ అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి
- కృష్ణా జలాల పర్యవేక్షణకు టెలీమెట్రీ ఏర్పాట్లు వేగవంతం చేయాలి
- తొలి దశ టెలీమెట్రీ కోసం రూ.4.15 కోట్లు ఇప్పటికే జమ చేసిన తెలంగాణ ప్రభుత్వం



ఢిల్లీ:
తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించినట్లు తెలిపారు. మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, అనుమతుల అంశాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ౦152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకోవాలని సీఎం కోరారు. ఈ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా ఎల్లంపల్లికి నీటిని తరలించవచ్చని వివరించారు. దీంతో నీటి తరలింపునకు అవసరమైన విద్యుత్ వినియోగం, వ్యయం తగ్గుతాయని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్‌కు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు. అనుమతుల జాప్యం వల్ల ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని తెలిపారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో పర్యావరణ అనుమతులకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రాజెక్టులకు వీలైనంత త్వరగా పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని కోరారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను ఇప్పటికే సీడబ్ల్యూసీకి సమర్పించినట్లు తెలిపారు. నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు చర్చలు జరుపుతున్నట్లు వివరించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మొదటి దశ టెలీమెట్రీ ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిందని గుర్తు చేశారు. మొదటి దశ టెలీమెట్రీ యంత్రాల ఏర్పాటుతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను కూడా త్వరగా ఏర్పాటు చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్ దాస్, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పేదల కన్నీటికి విలువ కట్టలేం..

మొదటి తరువాయి

భూములను గుర్తించి, వాటిని హౌసింగ్ శాఖకు బదలాయించి పేదల కోసం గ్రౌండ్ ప్లస్ టెన్ అంతస్తుల అపార్ట్‌మెంట్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాంపల్లి శాసనసభ నియోజకవర్గంలోని రెడ్ హిల్స్ లో మంగళవారం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి సహచర మంత్రి అజారుద్దీన్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహానగరంలో ఒక్కో ఎకరం భూమి విలువ రూ.200 కోట్లు, రూ.250 కోట్లు ఉన్నా.. ఆ భూమి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేద కుటుంబానికి ఒక సొంత ఇల్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈరోజు పారదర్శకంగా నిర్వహించిన డ్రాలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, మిగిలిన వారికి రెండో, మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్లు అందిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలోని మొత్తం 20 నియోజకవర్గాల్లో భూములను గుర్తించామని, సుమారు 16--17 ప్రాంతాల్లో టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

# ఫార్మా భూములు రైతులకే ఇవ్వాలి

మొదటి తరువాయి

అయినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. అదే భూములను ఫ్యూచర్ సిటీ పేరుతో ఎకరాకు రూ.4 కోట్ల చొప్పున విక్రయించేందుకు సిద్ధమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ఆరోపణను ఇతర వార్తా కథనాలు కూడా ఆయన తాజా వ్యాఖ్యలుగా నివేదించాయి. ఫార్మాసిటీ భూముల విషయంలో ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకుని రైతులకు భూములను తిరిగి ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నదని ఆయన విమర్శించారు. రైతుల భూముల అంశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి కూడా కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

# అభివృద్ధిలో భాగంగానే చిరు వ్యాపారుల డబ్బాల తొలగింపు

**●మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్**



**ఆమనగల్లు, సెప్టెంబర్29(నేటి దర్శిని):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద చిరు వ్యాపారుల డబ్బాలను తొలగించడం వెనుక ఎలాంటి వ్యక్తిగత ఉద్దేశం లేదని మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆసుపత్రి వద్ద 20 డబ్బాలు ఉండగా, ఐదుగురు మాత్రమే స్వయం ఉపాధి పొందుతున్నారని,మిగిలిన 15 డబ్బాలను ఇతరులకు అద్దెకు ఇచ్చారని పేర్కొన్నారు. సుమారు రూ.25 కోట్ల నిధులతో నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా గతంలో ఉన్న రెండో గేటునుపునరుద్ధరించడంతో పాటు రాబోయే రోజుల్లో పార్కింగ్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకే డబ్బాలను తొలగించినట్లు స్పష్టం చేశారు.ఆసుపత్రిలో మార్చురీ, డయాలసిస్ కేంద్రంతో పాటు ఇతర సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. గత పాలకవర్గం హయాంలోనూ రోడ్డు విస్తరణలో భాగంగా రాజీవ్ గాంధీ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు, పోలీస్ స్టేషన్ వెనుక మాడుగుల రోడ్డు బీసీ హాస్టల్ వద్ద డబ్బాలు తొలగించిన విషయాన్ని గుర్తుచేశారు.అన్ని పార్టీల నాయకులు, ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు.అన్ని వర్గాలను, రాజకీయ పార్టీలను కలుపుకుని ఆమనగల్లు అభివృద్ధికి కృషి చేస్తామని మునిసిపల్ చైర్మన్ పత్య నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి,శివలింగం,చేనేత సహకార సంఘం అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, సత్యం, మల్లేష్ ,కుమార్ గౌడ్, దేవరశెట్టి మహేష్,అలీం,సురేష్ నాయక్, శివ, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం ముందు బిజెపి మహాధర్నా



**ఆమనగల్లు, సెప్టెంబర్ 29(నేటి దర్శిని):** చిరు వ్యాపారులను ఆదుకొని న్యాయం చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి డిమాండ్ చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి ఎదుట చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న షాపులను మున్సిపల్ అధికారులు తొలగిస్తున్నారు. మంగళవారం మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి చేపట్టిన మున్సిపల్ కార్యాలయం ఆవరణలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ చిరు వ్యాపారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ముందస్తు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా షాపులను తొలగించడం వల్ల వ్యాపారుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆచారి కోరారు.. అధికారులు వెంటనే స్పందించి చిరు వ్యాపారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గీత, మాజీ జెడ్పీటిసి కండే హరిప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, నిరంజన్, కో ఆప్షన్ సభ్యులు చుక్క అల్లాజీ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు చెక్కల లక్ష్మణ్, చెన్నకేశవులు, నరసింహ,కండే సుమన్, పార్టీ కార్యకర్తలు, చిరు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



## అక్టోబర్ 1 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు ఇబ్బందులు లేకుండా సేకరణ చేపట్టాలి

**● కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మిడ్జిల్,సెప్టెంబర్ 29 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** వానాకాలం (ఖరీఫ్) 2026--27 సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో సుమారు 4.26 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా ఉండగా, అందులో 1.53 లక్షల టన్నులను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 163 కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ 1 నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు



కేంద్రాల్లో గన్నీ సంచులు, తూకం, తేమ పరీక్ష పరికరాలు, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, సిబ్బంది తదితర మౌలిక వసతులు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. కేంద్రాలను ముంపునకు అవకాశం లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసి రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. గ్రేడ్--ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు తెలిపారు. గుర్తించిన ఏడు సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు వివరించారు. రైతులు ధాన్యాన్ని శుభ్రపరిచి, ఎండబెట్టి, తేమ శాతం 17 శాతానికి మించకుండా టోకెన్‌లో సూచించిన తేదీన కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అధికారులు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన మద్దతు ధరను 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, పౌరసరఫరాల శాఖ అధికారులు, డీఆర్‌డీఓ, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, పీఏసీఎస్, ఐకేపీ, మార్కెట్ కమిటీలు, రవాణా కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కళ్లల్లో వెలుగులు నింపుతున్న ఆమనగల్లు లయన్స్ క్లబ్

**● 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము**




**ఆమనగల్లు, సెప్టెంబర్29 (నేటి దర్శిని):** లయన్స్ క్లబ్ ఆమనగల్ వారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు కంటి వైద్యులు ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ సభ్యులు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ప్రారంభించారు.ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లు, టీవీలు ఎక్కువగా చూడటం తగ్గించి, కంటిని కాపాడుకోవాలని కోరారు. కొంతమంది విద్యార్థులకు దృష్టిలోపం వల్లే చూపు సరిగా కనిపించక ఇబ్బంది గురవుతున్నారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పుకోలేక బాధపడుతుంటారని ఇలాంటి వారి కోసం కంటి శిబిరాల వల్ల వారికి అవసరమైన అద్దాలు లయన్స్ క్లబ్ ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థులు తమ కళ్ళను సుచి, శుభ్రత పాటించాలని కండ్లు బాగుంటేనే ప్రపంచంలో ఏదైనా చూడగలుగుతామని అన్నారు. విద్యార్థుల్లో చిన్న వయసులోనే కంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తుగా గుర్తించి చికిత్స అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ సభ్యులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా భవిష్యత్తులో మరిన్ని పాఠశాలల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ శిబిరంలో 180 మంది విద్యార్థులకు కంటి వైద్యులు ఎం చంద్రశేఖర్ కంటి పరీక్షలు నిర్వహించగా 15 మందికి అద్దాలు అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మధుకర్, ఉపాధ్యాయులు, క్లబ్ పిఆర్ఓ పాషా విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సేవా సంకల్పంతో వృద్ధులకు అండగా బీజేపీ

**● ఆదర్శ వృద్ధుల ఆశ్రమంలో పండ్ల పంపిణీ**

**● మోదీకి ప్రజల ఆశీస్సులు ఉండాలి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నారోజు కుమారస్వామి**



**చింతపల్లి, సెప్టెంబర్ 29 ( నేటి దర్శిని ) :** ప్రధాని నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్లో భాగంగా చింతపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ వృద్ధుల ఆశ్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఆదేశాల మేరకు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ సూచనలతో ఓబీసీ మోర్చా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో చింతపల్లి మండల శాఖ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. కార్యక్రమానికి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నారోజు కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మోదీ నిండు నూరేళ్లు జీవించాలి ఈ సందర్భంగా నారోజు కుమారస్వామి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. దేశ సేవ, ధర్మ పరిరక్షణ, ప్రజల రక్షణ కోసం మోదీకి దేశ ప్రజల ఆశీస్సులు ఉండాలని కోరారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అండగా నిలవడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. అక్టోబర్‌లో వరుస సేవా కార్యక్రమాలు సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అక్టోబర్ 4న రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహన, అక్టోబర్ 9న అవయవదానంపై అవగాహన, అక్టోబర్ 11న గ్రామాలు, బస్తీల దత్తతతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల వీడియోలు, చిత్రాలను సేకరించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సివర్ల రమేష్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కుకుడపు రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి యనం శేఖర్, వార్డు సభ్యులు నల్ల సైదులు, సోమరాజు, ప్రదీప్, గజ్జి అభినవ్, దండేటికారు మహేష్, గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు సైదులు, మోహన్ రెడ్డి, ఎస్.ఎస్. చారి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల మక్తల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి



**మిడ్జిల్, సెప్టెంబర్ 29, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మక్తల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బీజేపీ నాయకులు డా. బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డిని నియమించినట్లు మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ తెలిపారు. సహ ఇన్‌చార్జీలుగా కర్నె స్వామి, జిందే జ్యోతి శ్రీనివాస్, జయానంద్ రెడ్డిలను నియమించారు.మక్తల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పట్టభద్రులను గుర్తించి, అర్హులైన వారి పేర్లను ఓటర్లుగా నమోదు చేసే ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని డీకే అరుణ సూచించారు.ఈ సందర్భంగా బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన డీకే అరుణకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పట్టభద్రులను గుర్తించి, వారి ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

# రాబోయే నెలల్లో భారీ ఆహార సంక్షోభం!

**- విదేశాంగ మంత్రి జైశంకర్ హెచ్చరిక**



**న్యూయార్క్ సెప్టెంబరు29 (నేటి దర్శిని):**
రాబోయే నెలల్లో ప్రపంచం భారీ ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉన్నదని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మంగళవారం హెచ్చరించారు. ఎరువుల కొరత, ధాన్యం రవాణాకు అంతరాయాలు, సూపర్ ఎల్ నినో ముప్పుతో పాటు ఉక్రెయిన్, గల్ఫ్‌లోని యుద్ధాలు గ్లోబల్ సౌత్ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన అన్నారు. న్యూయార్క్‌లో ఆసియా సొసైటీ నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ మాట్లాడుతూ, రెండు యుద్ధాలు అభివృద్ధి చెందుతున్న దేశాలపై తీవ్ర ప్రభావం చూపాయని చెప్పారు. ముఖ్యంగా ఇంధనరంగంపై భారత్ ఆందోళనగా ఉందని, మార్కెట్ చాలా ఒత్తిడితో ఉందని పేర్కొన్నారు. చమురు సరఫరాలతో రాజకీయాలు ముడిపెడితే ధరలు పెరుగుతాయని జైశంకర్ అన్నారు. ఇది మరింత సమస్యకు దారి తీస్తున్నదని చెప్పారు.

# 18 ఏండ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం?

**- ప్రత్యేక చట్టాలపై సుప్రీంకు కేంద్రం హామీ**




**న్యూఢిల్లీ, సెప్టెంబరు29 (నేటి దర్శిని):**
: దేశంలో 18 ఏండ్లలోపు వినియోగదారులకు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై ఆంక్షలు విధించే అవకాశం ఉంది. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు భారత చట్టాలను, ముఖ్యంగా మైనర్ల విషయంలో పాటించేలా ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చే విషయాన్ని పరిశీలించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది. పిటిషనర్ తరపున వాదించిన హెచ్ఎస్ ఫూల్కా, కేంద్రం తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా 18 ఏండ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా కంపెనీలతో చట్టబద్ధమైన ఒప్పందాలు చేసుకోరాదని, అటువంటి ఒప్పందాలను నివారించడానికి ప్లాట్‌ఫారాలు రక్షణ చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టుకు తెలిపారు. అంతేకాకుండా కేవలం కంపెనీలను స్వచ్ఛందంగా బాలల భద్రతా చర్యలను పాటించమని కోరడానికి బదులుగా, సోషల్ మీడియా, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల కోసం చట్టబద్ధంగా కట్టుబడి ఉండే నిబంధనలను రూపొందించడాన్ని ప్రభుత్వం పరిగణించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ అంశాన్ని పరిశీలించడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ నిబంధన కేవలం మార్గదర్శకంగా మిగిలిపోకుండా చట్టబద్ధమైన బలాన్ని కలిగి ఉండాలని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి పేర్కొన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు పిల్లలకు సంబంధించి భారతీయ చట్టాలను వాస్తవంగా పాటిస్తున్నాయా, లేదా అని కేంద్రం నిర్ధారించుకోవాలని జస్టిస్ బాగ్చి కోరారు.

# సంపాదకీయం

## ఇంటి పైకప్పే శక్తి కేంద్రం!



బొగ్గు, గ్యాస్ తదితర వనరులతో ఉత్పత్తి చేసిన విద్యుత్తుతో ఇవిని నడపడం ఒక మార్పు. అదే విద్యుత్తులో పెరుగుతున్న భాగాన్ని సూర్యుడి నుంచి పొందగలిగితే మరో మెట్టు. ఇంటి పైకప్పుపై సౌర విద్యుత్ ప్యానెళ్లు, ఇంటి వద్ద ఇవి ఛార్జర్, అవసరమైతే బ్యాటరీ నిల్వ, స్మార్ట్ మీటర్– ఇవన్నీ ఒకే వ్యవస్థగా పనిచేసే రోజులు దూరంలో లేవు. ఇప్పటికే ఆ దిశలో పునాది పడుతోంది. 2026 ఆగస్టు 12 నాటికి 'పిఎం సూర్య ఘర్' పథకం కింద 51.58 లక్షల కుటుంబాలు రూఫ్‌టాప్ సోలార్ ద్వారా లబ్ధి పొందుతున్నాయి. 14.8 గిగావాట్ల సామర్థ్యం ఏర్పాటు కాగా, దాదాపు 19 లక్షల కుటుంబాలకు సున్నా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు ఇవి రంగం కూడా వేగంగా విస్తరిస్తోంది. అంతర్జాతీయ ఇంధన సంస్థ 'ఐఇఎ' ప్రకారం 2025లో ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు 2 కోట్లను దాటాయి. కొత్తగా అమ్ముడైన ప్రతి నాలుగు కార్లలో ఒకటి ఎలక్ట్రిక్ కారు. ఈ వాహనాల వినియోగం 2025లో రోజుకు సుమారు 12లక్షల బ్యారెళ్ల చమురు అవసరాన్ని భర్తీ చేసినట్లు ఐఇఎ అంచనా వేసింది. భారత్‌లో 2025లో ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు 75 శాతం పెరిగి 1.65 లక్షలకు చేరాయి. మొత్తం కార్ల విక్రయాల్లో వాటా దాదాపు నాలుగు శాతం. వీటిలో సుమారు 60 శాతం దేశీయంగా టాటా, మహీంద్రా సంస్థలు తయారు చేసినవేనని ఐఇఎ పేర్కొంది. పిఎం ఈ–డ్రైవ్ పథకం కింద 2026 జూలై 22 నాటికి 23,22,878 ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహకాలు అందించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రజా ఇవి ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు రూ. 2,000 కోట్లు కేటాయించగా, 6,562 ఛార్జర్ల ఏర్పాటుకు రూ.689 కోట్లు ఆమోదించింది. ఇక్కడే తదుపరి ఆలోచన మొదలవ్వాలి. పెట్రోల్ బంకు నుంచి ఛార్జింగ్ కేంద్రానికి వచ్చాం. ఇక ఛార్జింగ్ కేంద్రం నుంచి సూర్యుడి దాకా వెళ్లాలి. ప్రతి ఇవిపై తప్పనిసరిగా సౌర ప్యానెళ్లు అమర్చాలన్నది ఆలోచన కాదు. వాహనం కదులుతూనే సూర్యకాంతితో విద్యుత్తు ఉత్పత్తి చేసుకునే సాంకేతికతపై పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే వాహనం పైకప్పుపై పరిమిత స్థలం, ప్యానెళ్ల బరువు, ఉష్ణోగ్రత, దుమ్ము, వర్షాలు, నీడ, తయారీ వ్యయం వంటి సవాళు ఉన్నాయి. అందుకే ప్రయోగశాల ఫలితాలను వెంటనే సామూహిక వినియోగానికి సిద్ధమైన సాంకేతికతగా చూడకుండా, భారత వాతావరణ పరిస్థితుల్లో దీర్ఘకాలిక పరీక్షలు, ఖర్చు–ప్రయోజన విశ్లేషణ, మన్నిక పరీక్షలు జరపాలి. వాహనం మీద ప్యానెల్ పెట్టకపోయినా సూర్యుడి విద్యుత్తును వాహనానికి అందించవచ్చు. అపార్ట్‌మెంట్ల పార్కింగ్ ప్రదేశాలు, కార్యాలయాలు, మార్కెట్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, హైవే పక్కన ఉన్న పార్కింగ్ ప్రాంతాల్లో సోలార్ కార్‌పోర్టులు ఏర్పాటు చేసి పగటిపూట ఉత్పత్తి చేసిన విద్యుత్తుతో వాహనాలను ఛార్జ్ చేయవచ్చు. అవసరమైన చోట బ్యాటరీ నిల్వను జత చేయవచ్చు.

గ్రామీణ ప్రాంతాల్లో ఇ–ఆటోలు, చిన్న సరకు వాహనాలు, వ్యవసాయ అవసరాలకోసం ఉపయోగించే విద్యుత్ వాహనాలకు స్థానిక సౌర విద్యుత్తుతో చిన్న ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చు. సూర్యుడు పగటిపూట ఉన్నా వాహనం అవసరం రాత్రి రావచ్చు. కాబట్టి బ్యాటరీ నిల్వ కూడా కీలకం. రూఫ్‌టాప్ సోలార్, బ్యాటరీ నిల్వ, ఇవి ఛార్జింగ్, స్మార్ట్ మీటరింగ్, స్థానిక విద్యుత్ గ్రిడ్ సామర్థ్యాన్ని సమన్వయం చేయాలి. భవిష్యత్తులో వాహనంనుంచి ఇంటికి లేదా గ్రిడ్‌కు విద్యుత్తు పంపే ద్విముఖ ఛార్జింగ్ సాంకేతికత కూడా ఉపయోగపడే అవకాశం ఉంది. సౌర విద్యుత్‌లోనూ పరిశోధన వేగంగా సాగుతోంది. సిలికాన్‌తోపాటు పెరోవ్‌స్కైట్ ఆధారిత టాండమ్ సౌర కణాలు అధిక సామర్థ్యాన్ని సాధిస్తున్నాయి. అయితే ప్రయోగశాలలో సాధించిన సామర్థ్యం, తక్కువ ఖర్చుతో దీర్ఘకాలం పనిచేసే వాణిజ్య ఉత్పత్తి ఒకటే కాదు. మన్నిక, భారీ స్థాయి తయారీ, వ్యయం, భారత వాతావరణ పరిస్థితుల్లో పనితీరు వంటి అంశాలపై మరింత పరిశోధన అవసరం. భారత్ వచ్చే పదేళ్లను శక్తి స్వావలంబన దిశగా మలచగలిగితే, దిగుమతి చమురుపై ఆధారాన్ని తగ్గించడంతోపాటు సౌర విద్యుత్తు, బ్యాటరీలు, ఇవిలు, ఛార్జింగ్ మౌలిక వసతులు, పరిశోధన, దేశీయ తయారీ రంగాల్లో తన సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది. ప్రపంచంలో ముందంజలో నిలవాలన్న భారత లక్ష్యానికి ఇలాంటి శక్తి మార్పు ఒక బలమైన పునాది కావచ్చు. పెట్రోల్ బంకును మూసేయడం లక్ష్యం కాదు. పెట్రోల్ బంకుపై ఆధారపడాల్సిన అవసరాన్ని తగ్గించడం లక్ష్యం. పెట్రోల్ బంకునుంచి ఛార్జింగ్ కేంద్రానికి వచ్చాం. ఇక ఛార్జింగ్ కేంద్రం నుంచి సూర్యుడి దాకా వెళ్లాలి.

# కేరళలో కాంగ్రెస్‌కు షాక్!..

**-స్థానిక ఎన్నికల్లో చేదు ఫలితాలు**

**-ఏడు సిట్టింగ్ స్థానాల్లో ఓటమి**



**తిరువనంతపురం సెప్టెంబరు29 (నేటి దర్శిని):**
కేరళలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కూడా కాకుండానే కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో హస్తం పార్టీకి ప్రజలు షాక్ ఇచ్చారు. 38 డివిజన్లకు జరిగిన ఎన్నికల్లో అధికార యూడీఎఫ్ ఏడు సిట్టింగ్ స్థానాలను కోల్పోయింది. మొత్తంగా యూడీఎఫ్ 19, ఎల్డీఎఫ్ 18, ఎన్డీఏ ఒక స్థానంలో గెలుపొందాయి. విపక్ష ఎల్డీఎఫ్ గతంలో కంటే మూడు స్థానాలను అధికంగా గెల్చుకుంది.

**పాలక్కాడ్‌లో యూడీఎఫ్‌కు ఎదురుదెబ్బ**

పాలక్కాడ్ జిల్లాలోని చిట్టూరు మున్సిపాలిటీలో అధికార యూడీఎఫ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. యూడీఎఫ్‌కు చెందిన సుమేశ్ అచ్చుతన్ అసెంబ్లీకి ఎన్నిక కావడంతో జరిగిన ఎన్నికలో ఇక్కడ ఎల్డీఎఫ్ విజయం సాధించింది. త్రికోడితానంలో కూడా ఎల్డీఎఫ్ అనూహ్య విజయాన్ని సాధించింది. ఈ విజయాలతో అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత ఎల్డీఎఫ్ పుంజుకుంటున్నదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. అలాగే యూడీఎఫ్ గెలిచిన పలు సీట్లలో కూడా ఓట్ల మార్జిన్ గణనీయంగా తగ్గడం మరో కోణాన్ని చూపిస్తున్నది. కోజికోడ్ కార్పొరేషన్‌లో కుట్టిచిరను గతంలో పెరంబాకు చెందిన ఐయూఎంఎల్ ఎమ్మెల్యే ఫాతిమా తాహ్లియా ప్రాతినిధ్యం వహించే వారు. కాగా, తమ సంస్థాగత, రాజకీయ పునరుద్ధరణ ప్రారంభమైందని ఎల్డీఎఫ్ భావిస్తున్నది.

# అక్టోబర్‌లో సిమెంట్ ధరలకు రెక్కలు!



**న్యూఢిల్లీ సెప్టెంబరు29 (నేటి దర్శిని):**
సిమెంట్ కంపెనీలు అక్టోబర్‌లో బస్తా ధరలను రూ.5–20 పెంచే అవకాశం ఉన్నదని సెంట్రమ్ బ్రోకింగ్ వెల్లడించింది. ఈ నెలలో భారత్‌లో బస్తా సిమెంట్ ధర సగటున రూ.7 పెరిగి రూ.356కు చేరుకొన్న నేపథ్యంలో ఈ అంచనా వెలువడింది. దక్షిణాదిలో బ్యాగ్‌కు రూ.11, మధ్య, తూర్పు, ఉత్తర భారతంలో రూ.5, పశ్చిమ భారతాన రూ.9 మేర ధరలు పెరిగే అవకాశం ఉన్నది. డిమాండ్ రికవరీ, డీలర్ ఆమోదంపై సిమెంట్ ధరల పెరుగుదల ఆధారపడి ఉంటుంది.

# సహచరుడి కాల్పులు..

**నలుగురు సీఐఎస్ఎఫ్ జవాన్లు మృతి**



**కథువా: సెప్టెంబరు29 (నేటి దర్శిని):**
తోటి జవాన్ జరిపిన కాల్పుల్లో నలుగురు సీఐఎస్ఎఫ్ సిబ్బంది మృతి చెందిన ఘటన జమ్ము కశ్మీర్‌లోని కథువా జిల్లాలో జరిగింది. సేవా 2 హైడల్ పవర్ ప్రాజెక్టు వద్ద క్యాంప్‌లో విధులు మారుతుండగా సీఐఎస్ఎఫ్ జవాన్‌ల మధ్య వివాదం ఏర్పడింది. దీంతో ఒక జవాన్ మిగిలిన వారిపై కాల్పులు జరపడంతో నలుగురు తీవ్రంగా గాయపడి మరణించారు. మృతులలో అసిస్టెంట్ కమాండెంట్, ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. మరోవైపు అరుణాచల్‌ప్రదేశ్‌లోని చాంగ్‌లాంగ్ జిల్లాలో భారత్–మయన్మార్ సరిహద్దు సమీపంలో అస్సాం రైఫిల్స్ పెట్రోలింగ్ బృందంపై మిలిటెంట్లు దాడి చేశారు. మంగళవారం ఉదయం సుమారు 6:30 గంటలకు నాపాంగ్ సర్కిల్‌లోని నాపాంగ్ నాలా సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిలో ఓ జవాన్ మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు.

# పేపర్లలో వ్యాసాలు రాయడం కాదు.. నిరసనల్లో పాల్గొనండి..

**-శశిథరూర్‌కు ఖర్గే సూచన**



**న్యూఢిల్లీ, సెప్టెంబరు29 (నేటి దర్శిని):**
ఇంగ్లీష్ పేపర్లలో వ్యాసాలు రాయడం కాకుండా.. కాంగ్రెస్ పార్టీ చేపట్టే నిరసనల్లో కూడా పాల్గొనాలని ఆ పార్టీ సీనియర్ నేత శశి థరూర్‌కు కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) మీటింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, శశి థరూర్ వంటి నేతలు హాజరయ్యారు. సర్ అంశం, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా సహా పలు తాజా రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకత్వానికి శశిథరూర్ కీలక సూచన చేశారు. గాంధీ జయంతి రోజు, అక్టోబర్ 2న న్యూఢిల్లీలో పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టాలని సూచించారు. దీనికి మల్లికార్జున ఖర్గే స్పందించారు. ఎప్పుడూ ఆంగ్ల పత్రికలలో వ్యాసాలు రాయడం మాత్రమే కాకుండా.. కాంగ్రెస్ చేపట్టే నిరసనల్లో కూడా పాల్గొనాలని సూచించారు. ఈ విషయలో ఇద్దరి మధ్యా చిన్న వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. అలాగే, ఇటీవల ఖర్గే పాల్గొన్న ఒక మీటింగ్‌లో వేదికను పసుపు నీళ్లతో శుభ్రం చేసినందుకు బీజేపీపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ విషయంలో కాంగ్రెస్‌లోని సీనియర్ నాయకులు సరిగ్గా స్పందించలేదని ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేశారు. సీడబ్ల్యూసీ మీటింగ్‌లో ఈ విషయంపై ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తనకు చాలా మంది కాంగ్రెస్ నాయకులు మద్దతు ఇవ్వలేదని, సరైన రీతిలో స్పందించలేదని ఆయన అన్నారు. ఇక.. శశి థరూర్ అంశానికి సంబంధించి ఆయన వివిధ ఆంగ్ల పత్రికలకు నిత్యం వ్యాసాలు రాస్తుంటారనే సంగతి తెలిసిందే. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, కొన్ని సూచనలు చేస్తూ ఆయన వ్యాసాలు రాస్తుంటారు. కొన్నిసార్లు కాంగ్రెస్ పార్టీకి, నాయకులకు కూడా చురకలు అంటిస్తుంటారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా తన అభిప్రాయాల్ని చెబుతుంటారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం



**మిడ్జిల్,సెప్టెంబర్ 29, (నేటి దర్శిని):** హైదరాబాద్‌లోని శ్రీ విశ్వేశ్వరయ్య భవన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మక్తల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు డా. బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి, తిరుమల్ రఘురామ్, రామ్ తిరుమల పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, సన్నాహకాలపై సమావేశంలో చర్చించారు.

## ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

**తలకొండపల్లి, సెప్టెంబర్ 29, (నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో వారి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను అభినందిస్తూ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## గుడిపల్లి మండల కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా రెడ్డిమల్ల రవి నియామకం



**దేవరకొండ సెప్టెంబర్ 29 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ డి.సి.సి ఎస్సీ విభాగం చైర్మన్ బోడ స్వామి ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గం గుడిపల్లి మండల కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా రెడ్డిమల్ల రవి నియామకమయ్యారు. టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ యేకుల రాజారావు, నల్గొండ జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ బోడ స్వామి చేతుల మీదుగా రెడ్డిమల్ల రవి ఈ నియామక పత్రాన్ని అందుకున్నారు. పార్టీ బలోపేతానికి, కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరియు దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, జిల్లా నేతల ఆశయాలకు అనుగుణంగా మండలంలో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా రెడ్డిమల్ల రవి మాట్లాడుతూ, దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆదేశానుసారం మండలంలో కాంగ్రెస్ పార్టీ మరియు ఎస్సీ విభాగం బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి: ఎమ్మెల్యే బాలునాయక్



**దేవరకొండ, సెప్టెంబర్29( నేటి దర్శిని):** నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. 2026 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు అయిన ప్రతి పట్టభద్రుడు ఓటుకు అర్హులని తెలిపారు. గతంలో నమోదు చేసుకున్న వారు కూడా మళ్లీ రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. కావాల్సిన పత్రాలు: డిగ్రీ సర్టిఫికెట్ ,ప్రొవిజనల్ జిరాక్స్, ఆధార్ కార్డు,ఓటర్ ఐడీ కార్డు, ఫోటో, ఆన్‌లైన్‌లో ద్వారా లేదా తహసీల్దార్ కార్యాలయంలో ఫారం-18 ద్వారా నమోదు చేసుకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హార్ట్ ఎమర్జెన్సీలో 108 అంబులెన్స్ కీలక సేవలు



పేషెంట్ ని ఎప్పటికప్పుడు 108 వాహనంలోనే పర్యవేక్షిస్తున్న టెక్నీషియన్



టెక్నీషియన్ నల్లగంతుల యాదగిరి



టెక్నీషియన్ వెంపాటి ప్రతాప్

- **గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలింపుతో ప్రాణాలు కాపాడే అవకాశం..**
- **వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 108 సేవలపై అవగాహన**

**నిడమనూరు, సెప్టెంబర్ 29 (నేటి దర్శిని):** వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిడమనూరు 108 సిబ్బంది ప్రజలకు సూచించారు. గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో సొంత వాహనాల్లో ఆసుపత్రికి వెళ్లే ప్రయత్నం చేయడం కంటే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడం ద్వారా మార్గమధ్యంలోనే అవసరమైన అత్యవసర వైద్య సహాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 108 అంబులెన్స్‌లకు నెలకు సగటున 1,500 నుంచి 2,000 వరకు గుండె సంబంధిత అత్యవసర కేసులు వస్తున్నాయని, రోజుకు సుమారు 50 నుంచి 70 కేసులు నమోదవుతున్నాయని సిబ్బంది తెలిపారు. గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో తొలి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, ఈ సమయంలో బాధితుడిని త్వరగా ఆసుపత్రికి తరలించడంలో 108 సేవలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. 108 అంబులెన్స్‌లలో శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. అవసరాన్ని బట్టి రోగికి ఆక్సిజన్ అందించడం, అత్యవసర మందులు ఇవ్వడం, సీపీఆర్ చేయడం వంటి ప్రాథమిక అత్యవసర వైద్య సహాయం అందిస్తారని పేర్కొన్నారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో అవసరమైనప్పుడు అంబులెన్స్‌లోని AED (Automated External Defibrillator) ను కూడా వినియోగించి ప్రాణాలను కాపాడేందుకు చర్యలు చేపడతారని తెలిపారు.అంబులెన్స్‌లో రోగి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు మల్టీ ఛానల్ మానిటర్, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే పోర్టబుల్ ఆక్సిజన్ సిలిండర్, అవసరమైన ఔషధాలు, ఇతర అత్యవసర వైద్య పరికరాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. విషపదార్థాలు తీసుకున్న సందర్భాల్లో వైద్య అవసరాన్ని బట్టి ఉపయోగించే సక్షన్ ఆపరేటర్ వంటి పరికరాలు కూడా అంబులెన్స్‌లో ఉన్నాయని వివరించారు.గుండెపోటు లేదా ఇతర ప్రాణాపాయ అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా 108కు సమాచారం అందించి, అందుబాటులో ఉన్న అత్యవసర సేవలను వినియోగించుకోవాలని నిడమనూరు 108 సిబ్బంది ఈ.ఏం.టి వెంపటి ప్రతాప్, నల్లగంతుల యాదగిరి, జిల్లా మేనేజర్ సునీల్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ సలీం ప్రజలకు సూచించారు.

## గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పనులే ఆధారం!





- **ఇంకుడు గుంతలు.. సోక్‌పిట్లు.. ఫారం పాండ్లు.. కల్లాల నిర్మాణం**
- **బోర్‌వెల్ రీచార్జ్, కుంటలు, చెక్‌డ్యామ్‌లకు ప్రాధాన్యం**
- **ఉపాధి హామీ కూలీలకు విస్తృతంగా పనుల కల్పన**
- **వీజీపీపీ తొలి గ్రామసభలో కీలక అంశాలపై చర్చ**

**చింతపల్లి, సెప్టెంబర్ 29 (నేటి దర్శిని):** గ్రామాభివృద్ధి, నీటి సంరక్షణ, రైతుల సంక్షేమం, ఉపాధి హామీ కూలీలకు పనుల కల్పన లక్ష్యంగా వీజీపీపీ తొలి గ్రామసభలో పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ సర్పంచ్ నల్ల సుమిత రఘుకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి, ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే అంశాలపై చర్చ జరిగింది.

**నీటి సంరక్షణకు పెద్దపీట**

వర్షపు నీటిని వృథాగా పోకుండా ఒడిసిపట్టేందుకు గ్రామంలో ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం చేపట్టాలని చర్చించారు. అలాగే నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి కుంటలు, చెక్‌డ్యామ్‌లు నిర్మించాల్సిన అవసరంపై చర్చించారు. బోర్లలో భూగర్భ జలాలను పెంపొందించేందుకు బోర్‌వెల్ రీచార్జ్ పనులు చేపట్టే అంశాన్ని కూడా గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు.

**రైతులకు ఉపయోగపడే పనులు**

రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పొలాల్లో ఫారం పాండ్లు, ధాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లాలు, పశువుల సంరక్షణకు పశువుల షెడ్లు నిర్మించే పనులను ఉపాధి హామీ పథకం కింద చేపట్టే విషయంపై చర్చించారు. గ్రామంలోని రైతులకు, కూలీలకు ప్రయోజనం చేకూరేలా పనులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేయాలని సూచించారు.

**కూలీలకు నిరంతర ఉపాధి**

ఉపాధి హామీ కూలీలకు గ్రామంలోనే విస్తృతంగా పనులు కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని గ్రామసభలో చర్చించారు. గ్రామ అవసరాలతో పాటు నీటి సంరక్షణ, వ్యవసాయ రంగానికి ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నల్ల సుమిత రఘుకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి, ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామసభలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్ల రఘుకుమార్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, యువకులు, గ్రామ పెద్దలు, రైతులు, చింతపల్లి మండల ఏపీఓ, టీఏ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు

**మంథని, , సెప్టెంబర్ 29 (నేటి దర్శిని):** మంథనిలోని ప్రణామ్ డే కేర్ సెంటర్లో మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక సమావేశం, ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ శ్రీనిజ కోయిర్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో వయోవృద్ధుల పాత్ర అమూల్యమైనదని, వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ డీడబ్ల్యూఓ కార్యాలయ సూపరింటెండెంట్ రాజయ్య, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ స్వర్ణలత, సీడీపీఓ పుష్పలత పాల్గొని, వయోవృద్ధులకు



ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు, వారి రక్షణకు ఉన్న చట్టాలు, అత్యవసర సమయాల్లో ఉపయోగపడే టోల్ ఫ్రీ నంబర్లపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం సందర్భంగా వయోవృద్ధుల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ శివాని వారి వైద్య బృందం పాల్గొని సీనియర్ సిటిజన్లకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి అవసరమైన ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో న్యాయవాదులు శశి భూషణ్ కాచే, షబానా, శ్రీలక్ష్మి, ప్రణామ్ డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ పుష్ప లతతో పాటు సీనియర్ సిటిజన్లు ఖాజా మొయినుద్దీన్, వేపచెట్టు రాజన్న, నూనె రాజేశం, మెడగోని రాజమౌళి గౌడ్ వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# రైస్ మిల్లర్ ఆత్మహత్య లేఖలో సంచలన ఆరోపణలు

- రూ.167 కోట్ల ఆర్థిక వివాదంపై తీవ్ర ఆరోపణలు
- ఎన్నికల ఫండింగ్ పేరుతో రూ.2.50 కోట్లు తీసుకున్నారని ఆరోపణ
- పలువురు కాంగ్రెస్ నేతల పేర్లు లేఖల్లో ప్రస్తావన








**నల్గొండ, సెప్టెంబర్ 29 (నేటి దర్శిని):** నల్గొండకు చెందిన రైస్ మిల్లర్ మహేందర్ రాసినట్లు చెబుతున్న ఆత్మహత్య లేఖలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. తనను ఆర్థికంగా, మానసికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ 32 పేజీలకు పైగా లేఖలు రాసినట్లు మహేందర్ పేర్కొన్నారని సమాచారం. తన వ్యాపార భాగస్వాములు తనకు సుమారు రూ.167 కోట్ల మేర మోసం చేశారని మహేందర్ ఆరోపించారు. ఈ మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులను ఆశ్రయించినట్లు ఆయన లేఖల్లో పేర్కొన్నారని తెలిపారు. అదేవిధంగా, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఫండింగ్ పేరుతో రూ.2.50 కోట్లు తీసుకున్నారని మహేందర్ ఆరోపించారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పి తన నుంచి డబ్బులు తీసుకున్న అనంతరం, తిరిగి తనపైనే ఒత్తిడి తెచ్చారని ఆయన ఆరోపించినట్లు పేర్కొన్నారు. నల్గొండ మున్సిపల్ చైర్మన్ భర్త, కాంగ్రెస్ నాయకుడు బుర్రి శ్రీనివాస్ రెడ్డి, అలాగే సోమవరపు సత్యనారాయణ తదితరుల పేర్లను తన లేఖల్లో ప్రస్తావించినట్లు మహేందర్ పేర్కొన్నారని సమాచారం. తనకు రావాల్సిన డబ్బులు అందకుండా అడ్డుకోవడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. తనపై ఎలాంటి తప్పు లేకపోయినా కొందరు వ్యక్తులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి ఒత్తిడి కారణంగా కుటుంబం తీవ్ర మనోవేదనకు గురవుతోందని మహేందర్ లేఖల్లో పేర్కొన్నట్లు సమాచారం. తాను ఎవరెవరికి ఎంత మొత్తంలో డబ్బులు ఇచ్చాననే వివరాలను కూడా లేఖల్లో వెల్లడించినట్లు ఆయన పేర్కొన్నారని తెలిపారు.

# అశుభ్ర వాతావరణంలో టిఫిన్ సెంటర్







- తార్నాక విజయ డైరీ ముందు యథేచ్ఛగా వ్యాపారం
- అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?
- ప్రజల ఆరోగ్యంపై మున్సిపల్ అధికారులకు శ్రద్ధ లేదా.?

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 29 (నేటి దర్శిని):** తార్నాక విజయ డైరీ ముందు నిర్వహిస్తున్న ఓ టిఫిన్ సెంటర్‌పై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టిఫిన్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పూర్తిగా లోపించడం, ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అసలు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మదర్ డైరీకి సంబంధించిన రూమ్‌ను ఉపయోగించుకుంటూ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆ ప్రదేశం ఏ ప్రయోజనం కోసం కేటాయించబడింది.? అక్కడ ఆహార వ్యాపారం నిర్వహించేందుకు అనుమతులు ఉన్నాయా.? ఫుడ్ సేఫ్టీ నిబంధనలు, మున్సిపల్ అనుమతులు, పారిశుధ్య ప్రమాణాలు పాటిస్తున్నారా.? అనే అంశాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొంతమంది మున్సిపల్ అధికారులకు ప్రతినెల మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

**నాసిరకం ఆహారంతో ఆరోగ్యానికి ముప్పు.?**

టిఫిన్ల తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల నాణ్యత, వంట చేసే ప్రదేశం పరిశుభ్రత, తాగునీటి నాణ్యత, వంట నూనెల వినియోగం వంటి అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఇక్కడ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. టిఫిన్లలో అధికంగా ఉప్పు, కారంఉపయోగిస్తున్నారని, రుచి కంటే ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా ఆహారం తయారు చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. అశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేస్తే వినియోగదారుల ఆరోగ్యంపై రోగాల ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఇటువంటి ఆహారం తీసుకుంటే కొత్త రోగాలు వచ్చే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు.

**ఫిర్యాదులు చేసిన చర్యలు శూన్యం.?**

సికింద్రాబాద్ నియోజకవర్గంలో మున్సిపల్ అనుమతులు లేకుండా రోడ్ల ఫుట్పాతులపై నిర్వహించే టిఫిన్ సెంటర్‌పై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ కనీస చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే కారణమ లేక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా వ్యాపారం సాగుతున్నదనే ఆరోపణలు నిజమైతే అధికారులు విచారణ జరిపి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకుల అండదండలతోనే టిఫిన్ సెంటర్ యథేచ్ఛగా కొనసాగుతోందన్న ఆరోపణలపైనా అధికారులు విచారణ చేయాల్సిన అవసరం ఉంది.

**అధికారుల తనిఖీలు ఎప్పుడు.?**

ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార వ్యాపారాలపై మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. టిఫిన్ సెంటర్‌కు అవసరమైన అనుమతులు ఉన్నాయా.? ఆహార భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా.? పరిశుభ్రత ప్రమాణాలు ఎలా ఉన్నాయి.? అనే అంశాలపై అధికారులు బహిరంగంగా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణమే స్పందించి ట్రేడ్ లైసెన్ లేని టిఫిన్ సెంటర్ల ను మూసివేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పోషకాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం

- సీడీపీవో మణెమ్మ



**బచ్చన్నపేట, సెప్టెంబర్ 29 (నేటి దర్శిని):** తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యవంతంగా ఎదుగుతుందని, శిశువుకు తల్లిపాలే సంపూర్ణ పోషణను అందిస్తాయని జనగామ ఐసీడీఎస్ సీడీపీవో మణెమ్మ అన్నారు. పోషణ మాసం సందర్భంగా మంగళవారం బచ్చన్నపేట మండల కేంద్రంలోని బోడిగం వనజ అంగన్వాడీ కేంద్రంలో గ్రామంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల టీచర్ల ఆధ్వర్యంలో పోషణ మాస ఉత్సవాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో మణెమ్మ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టినప్పటి నుంచి తొలి ఆరు నెలల వరకు తల్లిపాలను మాత్రమే అందించాలని సూచించారు. శిశువు జీవితంలో తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని తెలిపారు. ఆరు నెలల అనంతరం తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారాన్ని అందించాలని, రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు.గర్భిణులు, బాలింతలు సకాలంలో పౌష్టికాహారం తీసుకోవాలని, పండ్లు, కూరగాయలు, పప్పుదినుసులు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, సీజనల్ పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. పోషక విలువలున్న కూరగాయలు, ఆకుకూరల వినియోగంపై అవగాహన కల్పించారు. చిన్నారులను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆల్వాల నర్సింగరావు, సూపర్‌వైజర్ కవిత, ఉపసర్పంచ్ భైరి రజిత వెంకటేశ్, అంగన్వాడీ టీచర్లు బోడిగం వనజ, గణపురం కవిత, జ్యోతి, రజిని, పస్తం లక్ష్మి, పర్వతం భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, బాలమణి, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో
# పోషణ పక్షం వేడుకలు

- పాల్గొన్న సర్పంచ్ రాంసింగ్ నాయక్,



**దేవరకొండ సెప్టెంబర్ 29( నేటి దర్శిని):** దేవరకొండ మండలం మైలంపల్లి గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 'పోషణ పక్షం' కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రాంసింగ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు మరియు పిల్లలు ఆరోగ్యం కోసం పౌష్టికాహారాన్ని ఏ విధంగా తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, సర్పంచ్ మోహన్ లాల్, మాజీ ఉప సర్పంచ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు స్థానిక అంగన్వాడీ టీచర్లు ఈ కార్యక్రమంలో క్రియాశీలకంగా పాల్గొని, పోషకాహార ప్రాముఖ్యతను తెలియజేసే ప్రదర్శనలు మరియు కరపత్రాల పంపిణీ చేపట్టారు.

# పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు

- చిన్నారి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్ష




**చింతపల్లి , సెప్టెంబర్ 29 (నేటి దర్శిని):** చింతపల్లి మండలం మాల్ పట్టణంలోని జేపీ మహల్ ఫంక్షన్ హాల్‌లో చిన్నారి మహీరా పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ హాజరై చిన్నారి మహీరాను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారి మహీరాకు వారు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మహీరా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. చిన్నారి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మాజీ సర్పంచులు ఉడత అక్రమ్ యాదవ్, జ్యోతి చందర్ నాయక్, వైస్ ఎంపీపీ అరేకంటి రాములు, పడకంటి రాజు గౌడ్, ముద్దం జోగయ్య, జైపాల్ నాయక్, మోగుతాల దుర్గయ్య, అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, ఈరటి మల్లేష్, సుమన్ నాయక్, భాస్కర్ నాయక్, గడ్డం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 7న దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర మహాసభ ను విజయవంతం చేయాలి.

- డిండిలో ఎస్సై బాలకృష్ణ, ఎంపీడీవో వేజన్న చేతుల మీదుగా వాల్ పోస్టర్ ఆవిష్కరణ
- దళిత జర్నలిస్టుల ఫోరం డివిజన్ అధ్యక్షుడు ముడి లింగమయ్య





**దేవరకొండ సెప్టెంబర్ 29 ( నేటి దర్శిని )** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో అక్టోబర్ 7న జరగబోయే దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని దేవరకొండ డివిజన్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ముడి లింగమయ్య పిలుపునిచ్చారు. మంగళవారం డిండి ఎస్ఐ సిహెచ్ బాలకృష్ణ, ఎంపీడీవో వేదన చేతులమీదుగా వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లింగమయ్య మాట్లాడుతూ దళిత జర్నలిస్టులకు ప్రభుత్వం రావాల్సిన న్యాయపరమైన హక్కులు, డిమాండ్ల సాధన కోసం దళిత జర్నలిస్టుల ఫోరం నిరంతరం పనిచేస్తుని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వంభరా జర్నలిస్టు మల్లేష్, సూర్యుడు జర్నలిస్టు గుమ్మకొండ సుధాకర్, నీలగిరి జర్నలిస్టు చెన్నయ్య, నవభారత్ జర్నలిస్టు ముడి శ్రీను మరియు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు, త్రినేత్రం జర్నలిస్టు జహంగీర్, జుట్టు సతీష్ ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూముల కబ్జాలు ఆపేది ఎవరు.?

- ఎమ్మార్వో, ఆర్డీవో సహకారం లేకుండా కబ్జాలు సాధ్యమేనా.?
- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోరా.?
- ప్రభుత్వ భూముల రక్షణపై రెవెన్యూ యంత్రాంగం బాధ్యత ఏమిటి.?
- రిపోర్టర్ల పేరుతో కబ్జాలకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు











**జవహర్‌నగర్, సెప్టెంబరు29 (నేటి దర్శిని)**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని జవహర్‌నగర్ లో ప్రభుత్వ భూముల కబ్జాపై ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉన్నప్పటికీ, ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీలు, సర్వేలు, రికార్డుల పరిశీలన, చట్టపరమైన చర్యలు ఎందుకు వేగంగా జరగడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూముల వ్యవహారాలు రెవెన్యూ శాఖ పరిధిలోని ప్రధాన అంశాల్లో ఒకటని తెలంగాణ ప్రభుత్వ అధికారిక సమాచారం పేర్కొంటోంది. అలాగే ఆర్డీవో స్థాయిలో ప్రభుత్వ భూములు, ఆస్తులను రక్షించడం, ఆక్రమణలు అనధికార ఆక్రమణలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం వంటి విధులు ఉన్న కాప్రా రెవిన్యూ అధికారులు మౌనం వెనుక కోట్లలో దందా ఉందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**ఫిర్యాదులు వెళ్లినా స్పందన ఎందుకు.?**

జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని కొందరు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారులు మౌనంగా ఉండడం వెనుక కబ్జాదారులతో ముందుగానే అంతర్గత ఆర్థిక ఒప్పందాలు జరిగాయని అందుకోసమే జవహర్ నగర్ భూముల వ్యవహారంలో రెవెన్యూ అధికారులు అసలు పట్టించుకోరు. ఇప్పటివరకు కాప్రా రెవిన్యూ కార్యాలయంలో విధులు నిర్వహించిన సిబ్బంది అధికారులపై ఏసీబీ దాడులు చేయాలని కోట్ల అక్రమాస్తులు కూడా పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. రిటైర్డ్ ఆర్మీ భూముల పేరుతో దుంగ పత్రాలు సృష్టించి
ప్రభుత్వ భూమి అని రికార్డుల్లో ఉన్న స్థలంలో ఎవరైనా ఆక్రమణకు పాల్పడుతున్నారనే ఫిర్యాదు వస్తే ఎమ్మార్వో సర్వే నంబర్, రికార్డులు, భూమి వర్గీకరణ, హక్కులు, ఆక్రమణ స్థితిపై అధికారికంగా పరిశీలన జరగాలి. వెంటనే కూచివేతలు చేయాలి కానీ ఇక్కడ అవి జరగవు పూర్తిగా రాజకీయ నాయకుల తను సైగలతో పాటు ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి.

**అధికారుల అండ లేకుండా సాధ్యమేనా.?**

వందల ఎకరాలలో ఉన్న ప్రభుత్వ భూములపై ఆక్రమణలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్న కలెక్టర్ ఎందుకు స్పందించడం లేదు కలెక్టర్ మౌనమేనుక మతలబ్ ఏంటి అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.
తిలాపాపం తలా పిడికెడు అన్న చంద సంగ అధికార రాజకీయ హస్తం ఉందని మరి దీనిపై ముఖ్యమంత్రి కూడా మనం వహించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.
స్థానిక రెవెన్యూ సిబ్బందికి, ఎమ్మార్వో కు తెలియకుండా ఇలాంటి ఆక్రమణలు సంవత్సరాల తరబడి కొనసాగుతాయా.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**200 మంది రిపోర్టర్లు ఎవరెవరు.?**

జవహర్‌నగర్‌లో దాదాపు 200 మంది రిపోర్టర్లు ఉన్నారంటూ ప్రచారం జరుగుతున్నప్పటికీ, వారిలో నిజంగా గుర్తింపు పొందిన మీడియా సంస్థలకు పనిచేసేవారు ఎంతమంది.? వార్తలు రాసేవారు ఎంతమంది.? సంస్థ ఐడి కార్డ్ కొనుక్కొని రిపోర్టర్గా చలామణి అవుతున్నది ఎంతమంది.? పెన్ను పేపర్ చేతిలో పెట్టి వార్త రాయి అంటే రాసేది ఎంతమంది.? కనీసం వాళ్ళ పేరు వాళ్లు కూడా రాసుకోలేని పదవ తరగతి కూడా చదవలేని ఎంతోమంది ఇక్కడ రిపోర్టర్లుగా చలామణి అవుతున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం సోషల్ మీడియా ఖాతాలు నిర్వహిస్తూ "రిపోర్టర్"గా పరిచయం చేసుకునేవారు ఎంతమంది.? అనే ప్రశ్నలు కూడా చర్చకు వస్తున్నాయి. దీనిపై సమాచార శాఖ పోలీసు అధికారులు సంయుక్తంగా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నకిలీ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పత్రిక గుర్తింపు కార్డు ఉందని మాత్రమే ఎవరైనా అధికారికంగా జర్నలిస్టు అవుతారనే భావన సరికాదు. స్థానిక సమస్యలపై కథనాలు, అవినీతి అక్రమాలపై కథనాలు, అధికారుల ఇంటర్వ్యూలు వంటి అంశాలను ఎంతమంది రాస్తున్నారు రాయగలరు కేవలం యూట్యూబ్ ఛానల్ సొంతంగా ఏర్పాటు చేసుకొని వాళ్లకు వాళ్లే ఐడి కార్డ్ తయారు చేసుకుని ఎడిటర్ లేదా సీఈఓ లేదా ఎండి అని ప్రచురించుకొని ఇక్కడ హల్చల్ చేయడం దాదాపు 80% వరకు జరుగుతుందన్న విమర్శలు ఉన్నాయి.

**రిపోర్టర్ల పేరుతో వసూళ్ల ఆరోపణలు**

ప్రభుత్వ భూముల కబ్జా చేసిన స్థలాలలో గదులు, షెడ్లు ఏర్పాటు చేసే వాళ్ళ వద్ద మీడియా పేరును ఉపయోగించి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రిపోర్టర్ల మంటూ చెప్పుకొని కబ్జాదారులకు సహకరించి అధికారులను బెదిరించడం లేదా లొంగదీసుకోవడం సెటిల్మెంట్లు చేయడం చేస్తున్నారని వాస్తవానికి వాళ్లకు జర్నలిజంపై కనీస అవగాహన కూడా లేదని స్థానికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇలాంటి నకిలీలపై సమాచార శాఖ పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొంతమంది అక్రిడేషన్ కార్డులు కొనుక్కొని ఇక్కడ రిపోర్టర్లుగా వ్యవహరించడం సర్వసాధారణంగా మారింది. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో కేవలం ఒక శాఖతోనే కాకుండా అవసరమైన సందర్భాల్లో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, సంబంధిత ఆస్తి పరిరక్షణ విభాగాల మధ్య సమన్వయం అవసరం. హైదరాబాద్ ప్రాంతంలో ప్రభుత్వ భూముల రక్షణ, ఆక్రమణల తొలగింపుకు హైడ్రాకు కూడా అధికారికంగా బాధ్యతలు అప్పగించబడ్డాయి. మరి ప్రభుత్వ భూముల కబ్జాపై జవహర్ నగర్ లో హైడ్రా రాకపోవడం విడ్డూరంగా మారింది.

## కలెక్టర్ స్పందించాల్సిందే

జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూములపై వస్తున్న అనేక ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పూర్తిస్థాయిలో యంత్రాంగంతో ప్రత్యేకంగా సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూముల వివరాలను బహిర్గతం చేయాలని, ప్రభుత్వ భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్న కనీస అవగాహన కలెక్టర్కు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు ఎవరు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. అధికారులు నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు ఉంటే వెంటనే సస్పెండ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి. దాని రక్షణలో కలెక్టర్ నిర్లక్ష్యానికి తావుండకూడదు. జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూములపై వస్తున్న ఆరోపణలపై జిల్లా కలెక్టర్ స్థాయిలో సమగ్ర విచారణ జరిగి వాస్తవాలు వెలుగులోకి రావాలని స్థానికులు కోరుతున్నారు.

---

### మత సామరస్యానికి
# ప్రతీక ఎల్లికట్ట దర్గా ఉరుసు

- ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి
- ఎల్లికట్ట దర్గా ఉరుసు ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రత్యేక ప్రార్ధనలు



**రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 29 (నేటి దర్శిని):**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లికట్ట గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ హజ్రత్ సయ్యద్ అబ్బాస్ షా ఖాద్రి దర్గా ఉరుసు ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా దర్గాను దర్శించుకున్న ఆయనకు దర్గా కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలకగా,సాంప్రదాయ పద్ధతిలో చాదర్ సమర్పించి ప్రత్యేక దువా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ..ఎల్లికట్ట దర్గా ఉరుసు ఉత్సవాలు హిందూ-ముస్లింల మత సామరస్యానికి, గంగా-జమునా తెహజీబ్ సంస్కృతికి సజీవ సాక్ష్యమని కొనియాడారు. కులమతాలకు అతీతంగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకోవడం సంతోషకరమని పేర్కొంటూ, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సాయి ప్రసాద్ యాదవ్,గోపాల్ నాయక్,మాజీ కౌన్సిలర్ ఈశ్వర్ రాజు,నాయకులు శేరి శ్రీనివాస్ రెడ్డి,ముత్యాల రాజు,దినేష్ రెడ్డి, శ్రీపతి,మేడిపల్లి యాదయ్య,మంగలి శ్రీశైలం నక్క నరేందర్,గున్న వెంకటేష్,నక్క మహేష్,నక్క సురేష్ బద్దుల సురేష్,గున్న లోకేష్,జంగిలి శుభాష్,అజ్జు,అబ్బాస్ మరియు మైనారిటీ నేతలు మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

---

### ఘనంగా సుబ్బురు
# సందీప్ కుమార్ జన్మదిన వేడుకలు







- కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి, హరిహర అయ్యప్ప, సీతారామాంజనేయ స్వామి ఆలయాల్లో దర్శనం చేసుకున్న సుబ్బురు సందీప్ కుమార్

**ఎల్బీనగర్, సెప్టెంబర్ 29 (నేటి దర్శిని):**
సుబ్బురు సందీప్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జన్మదినం సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు, అభిమానులతో కలిసి పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానాంజనేయ స్వామి ఆలయం, హరిహర అయ్యప్ప ఆలయం, సీతారామాంజనేయ స్వామి ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. సందీప్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. వేడుకల్లో కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## వకీల్‌సాబ్ నటి హాట్ ఫోజులు

# ఆ మాటకు అర్థం తెలిసింది!



'డ్రాగన్' చిత్రంతో యువతరానికి దగ్గరైంది అస్సామీ సొగసరి కయాదు లోహర్. ఇటీవల విడుదలైన 'ది ప్యారడైజ్' చిత్రంలో సుబ్బలక్ష్మిగా ఆమె ఆకట్టుకుంటున్నది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సినిమాలోని తన పాత్ర, దర్శకుడి పనితీరుపై ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 'కథ చెప్పే సమయంలో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల 'నా వర్కింగ్‌స్టైల్ విభిన్నంగా ఉంటుంది.సినిమా విషయంలో నేను కాస్త 'మ్యాడ్'గా ఉంటాను. నా స్టైల్‌కు సిద్ధంగా ఉంటేనే ముందుకు రండి' అంటూ సున్నితంగా హెచ్చరించారు. సినిమా షూటింగ్‌లో దర్శకుడు పనితీరు ఏమిటో తెలిసింది. 'మ్యాడ్' అనే మాటకు అసలైన అర్థం తెలుసుకున్నా. అవుట్‌పుట్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తీవ్రంగా శ్రమిస్తాడాయన. ఈ సినిమాలో చేసిన పాత్ర పట్ల సంతోషంగా ఉన్నా' అని కయాదు లోహర్ ఆనందం వ్యక్తం చేసింది.

## శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' నుంచి

# 'ఎత్తర ఎత్తు' సాంగ్ విడుదల!




టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్' . జానకిరామ్ మారెల్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు.తాజాగా ఈ సినిమా నుంచి మూడో సింగిల్ అయిన ఎత్తర ఎత్తు లిరికల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యమందించగా, నల్గొండ గద్దర్ నర్సన్న ఆలపించారు. బాలు.ఎస్ కీస్ ప్రోగ్రామింగ్, లక్ష్మీనారాయణ టీమ్ లైవ్ రిథమ్స్, రాబిన్ సెబాస్టియన్ గిటార్ అండ్ బాస్ అందించగా, బాలు.ఎస్ మిక్స్ అండ్ మాస్టరింగ్ చేశారు. ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాధికా శరత్‌కుమార్, షైన్ టోమ్ చాకో, ఉపేంద్ర లీమాయ్ తదితరులు కీలక పాత్రల్లో పోషిస్తున్నారు. కోన వెంకట్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పి మరియు కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై వెంకట కృష్ణ కర్ణాటి, సీత కర్ణాటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



# నానితో రొమాన్స్ చేయబోతున్న గోల్డెన్ బ్యూటీ..

### -'బ్లడీ రోమియో'లో లక్కీ ఛాన్స్ ?



నేచురల్ స్టార్ నాని వరుస సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన మార్కెట్‌ను క్రియేట్ చేసుకుంటున్నారు. కథల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ.. కొత్త దర్శకులతో ప్రయోగాలు చేయడానికి ఎప్పుడూ ముందుండే నాని, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'ఓజీ' ఫేమ్ దర్శకుడు సుజీత్‌తో నాని కలిసి పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం.నాని--సుజీత్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ సినిమా ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. సినిమాలో నానికి జోడీగా టాలీవుడ్‌లో ప్రస్తుతం వరుస అవకాశాలతో దూసుకుపోతున్న మీనాక్షి చౌదరిని తీసుకునే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆమెతో సంప్రదింపులు జరుగుతున్నాయని సమాచారం.హర్యానాకు చెందిన మీనాక్షి చౌదరి మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి అడుగుపెట్టారు. 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమెకు 'హిట్ 2' మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఆ తర్వాత వరుసగా కీలక అవకాశాలు అందుకుంటూ టాలీవుడ్‌లో తన స్థాయిని పెంచుకున్నారు.'గుంటూరు కారం', 'సంక్రాంతికి వస్తున్నాం', 'లక్కీ భాస్కర్' వంటి చిత్రాలతో మీనాక్షి చౌదరి మంచి విజయాలను అందుకున్నారు. దీంతో ఆమెకు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం నాగచైతన్యతో 'వృషకర్మ'లో నటిస్తున్న ఈ భామకు ఇప్పుడు నాని సరసన నటించే అవకాశం దక్కితే అది ఆమె కెరీర్‌లో మరో కీలక అడుగుగా మారే అవకాశం ఉంది. ఇక నాని--సుజీత్ సినిమా కథాంశం కూడా చాలా కొత్తగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. యూకేలోని ఫుడ్ మాఫియా నేపథ్యంలో డార్క్ హ్యూమర్, యాక్షన్ అంశాలను కలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ ప్రపంచానికి సంబంధించిన కథలో నాని ఇప్పటివరకు కనిపించని సరికొత్త పాత్రలో కనిపించనున్నారని టాక్. నాని పాత్రలో చెఫ్‌కు సంబంధించిన షేడ్స్‌తో పాటు గ్యాంగ్‌స్టర్ తరహా లక్షణాలు కూడా ఉంటాయని ప్రచారం జరుగుతోంది. ఒకే పాత్రలో విభిన్న కోణాలను చూపించే విధంగా సుజీత్ కథను సిద్ధం చేసినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా కీలకమైన పాత్రలో కనిపించనున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. నాని, సుజీత్, పృథ్వీరాజ్ కాంబినేషన్‌కు తోడు మీనాక్షి చౌదరి కూడా భాగమైతే ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని 2027 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

# విడుదలకు ముందే షాక్..

### -ఆన్‌లైన్‌లో 'తెల్లకాగితం' సినిమా కంటెంట్ లీక్!



అక్టోబర్ 2న అట్టహాసంగా థియేటర్లలో విడుదల కావాల్సిన టాలీవుడ్ సినిమా 'తెల్లకాగితం' చిత్ర యూనిట్‌కు భారీ షాక్ తగిలింది. సినిమా విడుదలకు కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఉండగా.. ఈ చిత్రానికి సంబంధించిన కీలకమైన కంటెంట్ ఆన్‌లైన్‌లో లీక్ కావడం సినీ వర్గాల్లో కలకలం రేపింది. ఈ అనూహ్య పరిణామంతో చిత్ర నిర్మాతతో పాటు టెక్నీషియన్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అయితే ఈ వ్యవహారంపై స్పందించిన 'తెల్లకాగితం' చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. సినిమాకు సంబంధించిన లీకైన కంటెంట్‌ను ఎవరూ డౌన్‌లోడ్ చేయవద్దని, సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని మరియు ఇతరులకు సర్క్యులేట్ చేయవద్దని ప్రేక్షకులను హృదయపూర్వకంగా కోరింది.మా చిత్రం 'తెల్లకాగితం'కు సంబంధించిన కంటెంట్ అనుమతి లేకుండా ప్రచారం చేయబడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ సినిమా కంటెంట్‌ను చట్టపరంగా లీక్ చేయడాన్ని, షేర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. లీకైన కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయవద్దని, డౌన్‌లోడ్ చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ సినిమాను కేవలం థియేటర్‌లలోనే వీక్షించి మా చిత్రబృందానికి మీరంతా సంపూర్ణ మద్దతు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. అంటూ తెల్లకాగితం చిత్ర బృందం ప్రెస్ నోట్ విడుదల చేసింది. సినిమా సక్సెస్ వెనుక ఎంతోమంది కష్టపడతారని, ఇలాంటి పైరసీ చర్యలు మరియు లీక్‌లు చిత్ర యూనిట్‌ను తీవ్రంగా దెబ్బతీస్తాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రేక్షకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, లీక్ అయిన వీడియోలను ఎంకరేజ్ చేయకుండా కేవలం థియేటర్లలోనే సినిమాను చూసి విజయవంతం చేయాలని సినీ పరిశ్రమ కోరుతోంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365